

బాలాత్రిపురసుందరి అలంకరణలో భద్రకాళీ అమ్మవారు


## బాలాత్రిపురసుందరిగా భద్రకాళీ

**ఆలయంలో ప్రారంభమైన శరన్నవరాత్రి ఉత్సవాలు**

వరంగల్, అక్టోబర్ 3 : ప్రసిద్ధ భద్రకాళీ దేవాలయంలో దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు గురువారం అత్యంత వైభవంగా ప్రారంభం అయ్యాయి. వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి దంపతులు ఉత్సవాలను ప్రారంభించారు. తొలిరోజు అమ్మవారిని బాలాత్రిపురసుందరిగా అలంకరించారు. ఉదయం నిత్యాహ్నికం, గణపతి పూజ, పూర్ణాభిషేకం నిర్వహించారు. భేరీ పూజ నిర్వహించిన అనంతరం ధ్వజారోహణం చేశారు. ఆలయ ప్రధాన అర్చకులు భద్రకాళీ శేషు ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. భద్రకాళీ అమ్మవారిని ఉదయం వృషభ, సాయంత్రం మృగ వాహనంపై ఊరేగించారు. కాగా, భక్తులు బాలాత్రిపురసుందరి అలంకరణలో ఉన్న అమ్మవారిని దర్శించుకునేందుకు ఉదయం నుంచే పోటెత్తారు. ఏర్పాట్లను ఆలయ ఈవో శేషుభారతి, సూపరింటెండెంట్ విజయ్‌కుమార్ పర్యవేక్షించారు. మాజీ సీఎం కేసీఆర్ సమర్పించిన బంగారు ఆభరణాలను అమ్మవారికి అలంకరించారు.

**కాళేశ్వరంలో..**

కాళేశ్వరం : కాళేశ్వరంలోని శుభనందాదేవి (పార్వతి), శ్రీమహా సరస్వతి అమ్మవారి ఆలయాల్లో గురువారం అర్చకులు దుర్గాదేవి మాతను ప్రతిష్ఠించి ప్రత్యేక పూజలు చేశారు. తొలిరోజున దుర్గాదేవిని శైలపుత్రిగా అలంకరించగా భక్తులు దర్శించుకొని తీర్థ ప్రసాదాలు అందుకున్నారు. కార్యక్రమంలో ఈవో మారుతి, ఆలయ పర్యవేక్షకులు బుర్రి శ్రీనివాస్, అర్చకులు తదితరులు పాల్గొన్నారు.



కాళేశ్వరం : శైలపుత్రి అలంకరణలో శుభనంద (పార్వతి) అమ్మవారు



తొర్రూరులోని బీఆర్ఎస్ కార్యాలయంలో మాట్లాడుతున్న మాజీ మంత్రి దయాకర్‌రావు

# రుణమాఫీపై నేడు బీఆర్ఎస్ మెగా ధర్నా

**ఆరు గ్యారెంటీల అమలుపై పోరు**

- తరలిరానున్న మాజీ మంత్రి హరీశ్‌రావు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, రైతులు
- తొర్రూరులో ఏర్పాట్లను సమీక్షించిన ఎర్రబెల్లి దయాకర్‌రావు

తొర్రూరు, అక్టోబర్ 3 : రైతు రుణమాఫీని పూర్తిస్థాయిలో కాంగ్రెస్ ప్రభుత్వం ఇవ్వకపోవడం, ఆరు గ్యారెంటీలను అమలు చేయకపోవడాన్ని ఎండగడుతూ బీఆర్ఎస్ ఆధ్వర్యంలో తొర్రూరులో శుక్రవారం భారీ ధర్నా నిర్వహించనున్నారు. ఎర్రబెల్లి దయాకర్‌రావు నేతృత్వంలో నిర్వహించే కార్యక్రమానికి మాజీ మంత్రి తన్నీరు హరీశ్‌రావు, ఎమ్మెల్సీ సత్యవతిరాథోడ్, మధుసూదనాచారి, ఎమ్మెల్యేలు పల్లా రాజేశ్వర్‌రెడ్డి, పాడి కౌశిక్‌రెడ్డితో పాటు పలువురు నేతలు హాజరుకానున్నారు. ఈ మేరకు పార్టీ కార్యాలయంలో గురువారం నిర్వహించిన సన్నాహక సమావేశంలో మాజీ మంత్రి ఎర్రబెల్లి వెల్లడించారు. రైతులకు రూ. 2 లక్షల రుణమాఫీ పూర్తిస్థాయిలో ఇచ్చే వరకు వదిలిపెట్టేది లేదన్నారు. వంద రోజుల్లో ఆరు గ్యారెంటీలు అమలు చేస్తామని ఓట్లు దండుకున్న కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి 8 నెలలు గడుస్తున్నా వాటి ఊసే లేదని మండిపడ్డారు.

రైతు భరోసా ఏదని, రైతు బంధు నిధులను రుణమాఫీ కోసం మళ్లించి ఇచ్చిన హామీ అమలు చేశామని ప్రకటించుకోవడం సిగ్గు చేటన్నారు. రాష్ట్రంలో పాలన గాడి తప్పిందని, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పూర్తిగా విఫలమయ్యాడని అన్నారు. ఈ ధర్నాకు దగా పడ్డ రైతులంతా పెద్ద ఎత్తున హాజరు కావాలని పిలుపునిచ్చారు. గ్రామాల వారీగా రుణమాఫీ పొందని రైతుల వివరాలను కార్యకర్తలతో చర్చించి ధర్నా విజయవంతంపై పలు సూచనలు చేశారు. సమావేశంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు పసుమర్తి సీతారాములు, డాక్టర్ పీ సోమేశ్వర్ రావు, మాజీ ఎంపీపీ తూర్పాటి చిన్న అంజయ్య, రామిని శ్రీనివాస్, నలమాస ప్రమోద్, అనుమాండ్ల ప్రదీప్‌రెడ్డి, కుర్ర శ్రీనివాస్, కర్నె నాగరాజు, టీ వీరభద్రరావు, శామకూరి ఐలయ్య, కాలూనాయక్, వెంకన్న, పూలమ్మ, దేవమ్మ తదితరులు పాల్గొన్నారు.



ఎప్పుడూ లేని విధంగా ఈసారి ఖరీఫ్ సాగు రైతన్నకు పెను భారమైంది. అటు కాంగ్రెస్ సర్కారు రైతుభరోసా ఇవ్వకపోవడం, దీనికి తోడు వాతావరణ పరిస్థితులు అనుకూలించకపోవడంతో అన్నదాత అనేక ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వచ్చింది. ఫలితంగా పెట్టుబడి కోసం ప్రైవేట్ వ్యక్తుల వద్ద అప్పులు చేయాల్సి వచ్చింది. గత బీఆర్ఎస్ సర్కారు హయాంలో ఏటా జూన్‌లో ఠంచన్‌గా పెట్టుబడి సాయం రావడంతో రంది లేకుండా ఎవుసం సాగగా, ఈసారి మాత్రం ములుగు జిల్లాలో సుమారు రూ.80కోట్ల దాకా రైతులపై ఆర్థిక భారం పడింది. అంతేగాక నాణ్యమైన విత్తనాలు, ఎరువులు, పురుగుమందులు దొరకక బయట మార్కెట్‌లో అధిక ధరలకు కొనాల్సి వచ్చింది.

- ములుగు, అక్టోబర్ 3 (నమస్తే తెలంగాణ)

# రైతుకేదీ భరోసా?

## ఖరీఫ్ సీజన్‌లో భారంగా సాగుబడి

- పెట్టుబడి సాయం అందక రైతులపై అప్పులభారం
- రుణమాఫీతో కొంతమందికే లబ్ధి
- వానలు, ఎండలతో విచిత్ర పరిస్థితులు

ములుగు జిల్లాలో ఖరీఫ్ సాగుకు భరోసా లేకుండా పోయింది. కాంగ్రెస్ ప్రభుత్వం ఆర్భాటంగా రైతుభరోసా ఇస్తామని ప్రకటించినప్పటికీ అందించకపోవడంతో రైతులు ప్రైవేట్ వ్యక్తుల వద్ద అప్పు తెచ్చి సాగు చేయాల్సి వచ్చింది. గత బీఆర్ఎస్ సర్కారు హయంలో జూన్ నెలలో పెట్టుబడి సహాయం అందేది. జిల్లాలో 76వేల నుంచి 80వేల మంది రైతులకు సుమారు రూ.80కోట్ల పెట్టుబడి సాయం అందేది. కానీ కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక పెట్టుబడి సాయం మాత్రం అందలేదు. జిల్లాలో వరి, మిర్చి, పత్తి అధికంగా సాగు అవుతుండగా నాణ్యమైన విత్తనాలు, ఎరువులు, పురుగు మందులు కూడా లభించకపోవడంతో పాటు అధిక ధరలకు బయట మార్కెట్‌లో కొనుగోలు చేసి రైతులు ఆర్థికంగా నష్టపోయారు. ఫలితంగా రైతులు తీవ్ర ఆర్థిక భారాన్ని మోయాల్సి వస్తోంది. అంతేగాక రైతు రుణమాఫీదీ అదే పరిస్థితి. అర్హులైన రైతులకు రూ.2లక్షల వరకు రుణమాఫీ చేస్తామన్న ప్రభుత్వం జిల్లాలో రెండు విడుతల్లో కేవలం 23,857మందికి రూ.194కోట్ల 57వేలను మాత్రమే మాఫీ చేయగా ఇంకా వేలాది మంది ఎదురుచూస్తూనే ఉన్నారు. అటు రైతుభరోసా రాక.. రుణమాఫీ వర్తించక దరఖాస్తులు పట్టుకొని కార్యాలయాల చుట్టూ తిరిగి వేసారుతున్నారు.

## సర్వే సరే.. ఫారాలు ఎక్కడ?

- ప్రారంభం కాని ఫ్యామిలీ డిజిటల్ కార్డుల సర్వే
- బృందాలకు అందని ఫారాలు

వరంగల్, అక్టోబర్ 3 : ఫ్యామిలీ డిజిటల్ సర్వే తొలి రోజు ప్రారంభం కాలేదు. గురువారం 12వ డివిజన్ దేశాయిపేటలో మంత్రి కొండా సురేఖ, 48వ డివిజన్‌లో పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి ఫ్యామిలీ డిజిటల్ కార్డుల సర్వేను లాంఛనంగా ప్రారంభించారు. కానీ బృందాల వద్ద ఎలాంటి సర్వే ఫారాలు లేవు. గృహాల జాబితా సైతం అందలేదు. దీంతో మంత్రి దగ్గరలోని ఇంటికి వెళ్లి వివరాలు సేకరించి వెళ్లిపోయారు.

**250 గృహాల్లో మాత్రమే..**

ఫ్యామిలీ డిజిటల్ కార్డుల సర్వే గందరగోళంగా మారింది. ప్రస్తుతం 250 గృహాల్లో మాత్రమే సర్వే చేయాలని ప్రభుత్వం నుంచి ఆదేశాలు వచ్చాయి. గ్రేటర్‌లో పైలట్ సర్వేలో భాగంగా నాలుగు డివిజన్లలో సర్వే చేస్తున్నారు. వరంగల్‌లోని 12, 38, హనుమకొండలోని 10, 48 డివిజన్లలో మొత్తం 1000 గృహాల్లో సర్వే చేయనున్నారు. కాగా, డివిజన్‌లలో 250 గృహాల్లో మాత్రమే సర్వే చేయాలన్న ప్రభుత్వ ఆదేశాలతో అధికారులు అయోమయంలో పడ్డారు. 12వ డివిజన్‌లో 3,200 గృహాలున్నాయని, కొన్ని ఇళ్లు చేసి వదిలి కొన్ని ఇళ్లల్లో సర్వే చేస్తే ప్రజలు అడ్డుకునే అవకాశాలుంటాయని వారు వాపోతున్నారు.

## కరెంటు కాటుకు ఇద్దరు బలి

**విద్యుత్ తీగలకు తగిలి మహిళ..**

**షాక్‌తో బావిలో పడి రైతు మృతి**



భూమిరెడ్డి (ఫైల్)

భూపాలపల్లి రూరల్/ టేకుమట్ల, అక్టోబర్ 3 : భూపాలపల్లి జిల్లాలో కరెంటు కాటుకు ఇద్దరు బలయ్యారు. భూపాలపల్లి మండలం కమలాపూర్ గ్రామ శివారులో గుర్తు తెలియని వ్యక్తులు పందుల వేట కోసం విద్యుత్ వైరును అమర్చారు. గురువారం గ్రామానికి చెందిన సుక్కక్క (35) తమ పత్తి చేనులో పనిచేయడానికి వెళ్తుండగా విద్యుత్ తీగలకు తగిలి అక్కడికక్కడే మృతి చెందింది. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. మృతదేహాన్ని భూపాలపల్లి 100 పండకల దవాఖానకు తరలించారు. అలాగే టేకుమట్ల మండలం ద్వారకపేట గ్రామానికి చెందిన రైతు తిప్పిరెడ్డి భూమిరెడ్డి (41) బుధవారం మధ్యాహ్నం మిరప తోటకు నీరు పెట్టేందుకు వెళ్లాడు. బావి వద్ద మోటర్ ఆన్ చేయగా స్టార్ట్ కాలేదు. దీంతో మోటర్‌ను చైన్ బ్లాక్‌తో బావిలోంచి తీస్తుండగా కరెంట్ తీగకు తగిలి విద్యుదాఘాతంతో బావిలో పడిపోయాడు. గమనించిన రైతు భార్య దేవకి గ్రామంలోకి వెళ్లి విషయం తెలుపగా గ్రామస్తులు వచ్చి నీటిని మోటర్ల సాయంతో తోడి మృతదేహాన్ని బయటకు తీశారు. మృతుడి భార్య దేవకి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై ప్రసాద్ తెలిపారు.



వరంగల్‌లో ధర్నా చేస్తున్న మాజీ ఎమ్మెల్యే నన్నపునేని నరేందర్

## నిరూపించు.. లేదంటే తప్పుకో..

- కేటీఆర్‌పై మంత్రి సురేఖ వ్యాఖ్యలపై నన్నపునేని
- లేబర్‌కాలనీ జంక్షన్‌లో ధర్నా

కాశీబుగ్గ, అక్టోబర్ 3 : బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌పై మంత్రి కొండా సురేఖ చేసిన ఆరోపణలను నిరూపించాలని, లేనిపక్షంలో క్షమాపణ చెప్పి రాజకీయాల నుంచి తప్పుకోవాలని మాజీ ఎమ్మెల్యే నన్నపునేని నరేందర్ డిమాండ్ చేశారు. గురువారం వరంగల్ లేబర్‌కాలనీ జంక్షన్‌లో బీఆర్ఎస్ శ్రేణులతో కలిసి ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా నన్నపునేని మాట్లాడుతూ కేటీఆర్‌పై మంత్రి సురేఖ అనుచిత వ్యాఖ్యలు చేయడం సిగ్గుచేటన్నారు. ఆరోపణలు నిరూపిస్తే తాను రాజకీయాలకు శాశ్వతంగా దూరమవుతానన్నారు. వరంగల్ జిల్లా అంటే రాణి రుద్రమదేవి పౌరుషమని, అలాంటి గడ్డ పరువు, ప్రతిష్టను దిగజారుస్తున్నారని అన్నారు.

సినీ హీరో నాగార్జున కుటుంబాన్ని అవమానపర్చడం, ఇతర మహిళలపై అనుచిత వ్యాఖ్యలు చేయడం సరికాదన్నారు. ఆరోపణలు విరమించుకోకుంటే ఇక ముందు ఆందోళనలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు దిడ్డి కుమారస్వామి, మరుపల్లి రవి, మాజీ కార్పొరేటర్ కుందారపు రాజేందర్, పలువురు నాయకులు పాల్గొన్నారు.

# కేటీఆర్‌పై అసత్య ఆరోపణలు తగవు

- కొండా సురేఖది నీచ రాజకీయం
- వెంటనే బేషరతుగా క్షమాపణ చెప్పాలి
- బీఆర్ఎస్ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు దాస్యం వినయ్‌భాస్కర్



సమావేశంలో మాట్లాడుతున్న బీఆర్ఎస్ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు దాస్యం వినయ్‌భాస్కర్, చిత్రంలో మాజీ ఎమ్మెల్యేలు నన్నపునేని, పెద్ది

హనుమకొండ, అక్టోబర్ 3 : మంత్రి కొండా సురేఖది నీచ రాజకీయమని బీఆర్ఎస్ పార్టీ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు దాస్యం వినయ్ భాస్కర్ ధ్వజమెత్తారు. కేటీఆర్‌పై అసత్య ఆరోపణలు చేయడం తగదని, వెంటనే ఆయనకు బేషరతుగా క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. గురువారం మాజీ ఎమ్మెల్యేలు పెద్ది సుదర్శన్‌రెడ్డి, నన్నపునేని నరేందర్‌తో కలిసి విలేకరులతో మాట్లాడారు. ఒక మంత్రిగా ఉండి తోటి మహిళలపై అనుచిత వ్యాఖ్యలు చేసి కేటీఆర్‌పైకి నెట్టడాన్ని మహిళా లోకమంతా ఖండిస్తున్నదన్నారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల ముందు ప్రజలకిచ్చిన 420 హామీలు, 6 గ్యారెంటీలు అమలుచేసేంత వరకు పోరాడుతామని స్పష్టం చేశారు. రూ. 1.50 లక్షల కోట్లతో మూసీ నదిని అభివృద్ధి చేస్తామంటూనే హైడ్రా పేరుతో పేదల ఇండ్లు, గుడిసెలు కూల్చివేస్తున్న నేపథ్యంలో ప్రజలు కేటీఆర్, బీఆర్ఎస్‌పై చూపుతున్న అభిమానాన్ని తట్టుకోలేకే విమర్శిస్తున్నారని ఆరోపించారు. ప్రతిపక్షం ప్రశ్నిస్తే విమర్శలకు దిగుతూ డైవర్షన్ పాలిటిక్స్‌కు దిగుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. మూసీ పరీవాహక మహిళలు ఏడుస్తుంటే అండగా ఉంటున్న కేటీఆర్‌పై విమర్శలు చేయడమేంటని ప్రశ్నించారు. కేటీఆర్‌పై చేసిన అనుచిత వ్యాఖ్యలను వెనక్కితీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. మీ చరిత్ర, మీ కుటుంబ చరిత్ర తెలంగాణ ప్రజానీకానికి తెలుసని ఎద్దేవాచేశారు. మంత్రి హోదాలో ఉండి ఇతరుల కుటుంబ విషయాలు మాట్లాడడం సబబు కాదని హితవు పలికారు. మంత్రి హోదాలో ఉన్న నిన్ను కల్యాణ లక్ష్మితోపాటు తులం బంగారం, విద్యార్థినులకు స్కూటీలు, మహిళలకు ఇచ్చిన హామీలు ఏమయ్యాయని ప్రజలు ప్రశ్నిస్తున్నారన్నారు. రెండు నెలలకోసారి కొత్త డ్రామాతో బీఆర్ఎస్‌పై కాంగ్రెస్ అసత్య ప్రచారానికి తెరలేపుతున్నదని దాస్యం ధ్వజమెత్తారు. మాజీ ఎమ్మెల్యే నన్నపునేని నరేందర్ మాట్లాడుతూ మంత్రి కొండా సురేఖ అనాలోచిత మాటలకు మహిళలు బాధ పడుతున్నారని అన్నారు. కేటీఆర్‌పై చేసిన ఆరోపణలను నిరూపించు.. లేకుంటే మాటలు వాపస్ తీసుకో.. లేనిపక్షంలో క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. సమావేశంలో కార్పొరేషన్ల మాజీ చైర్మన్లు నాగుర్ల వెంకటేశ్వర్లు, మర్రి యాదవరెడ్డి, నియోజకవర్గ కో ఆర్డినేటర్ పులి రజినీకాంత్, బీఆర్ఎస్ నాయకులు నయీముద్దీన్, రెంటాల కేశవరెడ్డి, పెరకారి శ్రీధర్‌రావు, కార్పొరేటర్లు, పార్టీ శ్రేణులు పాల్గొన్నారు.



వరంగల్‌లోని పాపయ్యపేట చమన్ సెంటర్‌లో కొండా సురేఖ దిష్టిబొమ్మను దహనం చేస్తున్న నాగార్జున ఫ్యాన్స్

## నోరు అదుపులో పెట్టుకో..

- మంత్రి సురేఖకు నాగార్జున ఫ్యాన్స్ హెచ్చరిక
- పాపయ్యపేట చమన్‌లో దిష్టిబొమ్మ దహనం

మట్టెవాడ, అక్టోబర్ 3 : మంత్రి కొండా సురేఖ నోరు అదుపులో పెట్టుకోవాలంటూ హీరో నాగార్జున అభిమానులు హెచ్చరించారు. నాగార్జున కుటుంబంపై మంత్రి చేసిన అనుచిత వ్యాఖ్యలను నిరసిస్తూ ఆమె దిష్టిబొమ్మను గురువారం వరంగల్ నగరంలోని పాపయ్యపేట చమన్ సెంటర్‌లో దహనం చేశారు. ఈ సందర్భంగా అక్కినేని వంశ అభిమానుల సంఘం ఉమ్మడి వరంగల్ జిల్లా అధ్యక్షుడు కొడకండ్ల సదాంత్ మాట్లాడుతూ సురేఖ గౌరవప్రదమైన మంత్రిగా ఉండి నాగచైతన్య-సమంతల విడాకుల విషయమై దిగజారుడు మాటలు మాట్లాడడం విచారకరమన్నారు. వెంటనే అక్కినేని కుటుంబానికి బేషరతుగా క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌ను ఎదుర్కొనే దమ్ములేక సురేఖ స్థాయిని మరిచి నీచమైన మాటలు మాట్లాడడం ఏంటని వారు ప్రశ్నించారు.

అర్థంపర్థంలేకుండా మాట్లాడిన సురేఖపై సీఎం రేవంత్‌రెడ్డి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాగచైతన్య ఫ్యాన్స్ జిల్లా అధ్యక్షుడు ఎండీ మున్నా, ఎండీ జావిద్, మార్త కిరణ్, బోళ్ల శ్రీధర్, మేకల రాజు, రాజేశ్, సునీల్, రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

## విధి వంచితుడు!

- జీవితాన్ని చిదిమేసిన విద్యుత్ ప్రమాదం
- ఒళ్లంతా కాలి మంచానికే పరిమితమైన కట్టర్ రమేశ్
- పట్టించుకోని విద్యుత్ శాఖ ఉన్నతాధికారులు
- మూడేళ్ల క్రితం పరిహారం కోసం కోర్టులో కేసు
- ఎటూ తేలక ముందే మృత్యువాత
- లింగాలఘనపురంలో విషాదం



రమేశ్ (ఫైల్)

లింగాలఘనపురం, అక్టోబర్ 3 : అతడు ఆ ఊరిలోని వారందరికీ సుపరిచితుడు. ప్రతి ఒక్కరికి తలలో నాలుకలా ఉండేవాడు. ఎవరు పిలిచినా పలికేవాడు.. రాత్రనక, పగలనక ఎక్కడ కరెంట్ సమస్య ఉందన్నా వెళ్లి సరిచేసేవాడు. అతడిని విధి వంచించింది. ట్రాన్స్‌ఫార్మర్ వద్ద విద్యుత్ ప్రమాదం చోటుచేసుకోగా మంచానికే పరిమితం చేసింది. మూడేళ్ల క్రితం పరిహారం కోసం కోర్టులో వేసిన కేసు ఎటూ తేలకముందే అతడి జీవితాన్ని ముగించింది. తమ ఆత్మీయుడు కట్టర్ రమేశ్ ఇక లేడన్న విషయాన్ని గ్రామస్తులు జీర్ణించుకోలేకపోతున్నారు. వివరాల్లోకి వెళితే.. జనగామ జిల్లా లింగాలఘనపురం మండల కేంద్రానికి చెందిన జాగిళ్లపురం రమేశ్ (29) ఐటీఐ పూర్తిచేసి విద్యుత్ సంస్థలో కాంట్రాక్టర్ దగ్గర కట్టర్ (అన్‌మ్యాన్డ్ డిస్ట్రిబ్యూషన్ వర్కర్)గా రూ. 8 వేల వేతనంపై పనిచేస్తుండేవాడు. గ్రామంలోని గృహ వినియోగదారులు, వ్యాపారస్తులకు విద్యుత్ సమస్య తలెత్తితే పిలిచిందే తడవుగా వెళ్లి సరిచేస్తుండేవాడు. ఈ క్రమంలో 2020 జూన్ 6న ట్రాన్స్‌ఫార్మర్‌లో ఏర్పడ్డ సమస్యను సరిచేస్తుండగా విద్యుత్ షాక్‌కు గురైన రమేశ్ శరీరమంతా కాలిపోయి మంచానికే పరిమితమయ్యాడు. ఏడాదిన్నర కాపురం చేసిన అతడి భార్య విడాకులు తీసుకొని వెళ్లిపోయింది. కాంట్రాక్టర్ మాత్రం కొంత మానవత్వాన్ని ప్రదర్శించాడు. ఏడాదిపాటు జీతం చెల్లించాడు. ఈ క్రమంలో లింగాలఘనపురానికి ఏ విద్యుత్ ఉన్నతాధికారి వచ్చినా కుటుంబ సభ్యులు రమేశ్‌ను మంచంపై మోసుకెళ్లి న్యాయం చేయాలని వేడుకునే వారు. కొన్ని సందర్భాల్లో లింగాలఘనపురం సబ్‌స్టేషన్, అధికారుల ఎదుట ధర్నా చేశారు. మూడేళ్ల క్రితం నష్టపరిహారం కోరుతూ హైదరాబాద్‌లోని లేబర్ కోర్టులో కేసు వేయగా అది కొనసాగుతున్నది. ఆ కేసు ఎటూ తేలకముందే గురువారం విధి వక్రించి రమేశ్ కనుమూశాడు. దీంతో గ్రామంలో విషాదం అలుముకుంది.

## సొరంగ రైలు మార్గం ప్రారంభం

**హసన్‌పర్తి రోడ్ టూ కాజీపేటకు నడుస్తున్న గూడ్స్ రైళ్లు**



కోమటిపల్లి సొరంగ మార్గం నుంచి నడుస్తున్న గూడ్స్ రైళ్లు

కాజీపేట, అక్టోబర్ 3 : హసన్‌పర్తి రోడ్-కాజీపేట రైల్వే స్టేషన్ల మధ్యలోని కోమటిపల్లి సమీపంలో రైల్వేశాఖ నూతనంగా నిర్మించిన సొరంగ రైలు మార్గం నుంచి గురువారం గూడ్స్ రైళ్ల రవాణా ప్రారంభమైంది. సికింద్రాబాద్ రైల్వే డివిజన్ అధికారుల ఆదేశాలతో స్థానిక రైల్వే అధికారులు హసన్‌పర్తి రోడ్ నుంచి కాజీపేట వైపు గూడ్స్ రైళ్లను ఈ మార్గం ద్వారా నడిపిస్తున్నారు. బల్లార్షా-విజయవాడ మార్గంలో కాజీపేట టౌన్ రైల్వే స్టేషన్‌పై ట్రాఫిక్ భారాన్ని, రైళ్ల జాప్యాన్ని తగ్గించేందుకు ఈ సొరంగ మార్గాన్ని దాదాపు రూ. 32 కోట్లతో 342 మీటర్ల పొడువున కోమటిపల్లి సమీపంలో నిర్మించారు. ఇటీవల సీఆర్‌సీ అధికారుల బృందం రెండు రోజుల పాటు తనిఖీలు నిర్వహించింది. సొరంగ మార్గం నుంచి స్పిక్ రైలు(ట్రయల్ రన్)ను నడిపించారు. సేఫ్టీ అధికారుల బృందం తనిఖీల్లో హసన్‌పర్తి రోడ్-వరంగల్ రైల్వే స్టేషన్ వరకు థర్డ్, ఫోర్తు (బైపాస్) లైన్లలో పలు అంశాలపై లోపాలను గుర్తించి వెంటనే సరిచేయాలని సంబంధిత అధికారులకు సూచనలు చేశారు. వాటిని సరి చేయడంతో రైల్వే సీఆర్‌సీ సేఫ్టీ అధికారుల బృందం రైల్వేశాఖకు ఫిట్ సర్టిఫికెట్ ఇవ్వడంతో పాటు సొరంగ మార్గం నుంచి గూడ్స్‌రైళ్లను పరిమిత వేగంతో నడిపించాలని ఆదేశించింది.

## వాగు దాటి.. 12 కి.మీ నడిచి..

**గొత్తికోయలకు వైద్యసేవలందించిన సిబ్బంది**



గొత్తికోయగూడెం వెళ్లేందుకు బాలుడి సహాయంతో వాగు దాటున్న వైద్య సిబ్బంది

గోవిందరావుపేట, అక్టోబర్ 3: గోవిందరావుపేట మండలంలోని చల్వాయి గ్రామ శివారులోని అటవీ ప్రాంతంలో ఉంటున్న గొత్తికోయగూడెంలోని గొత్తికోయలకు వాగు దాటి, 12 కిలోమీటర్లు నడిచి వెళ్లి వైద్య సేవలందించారు. జిల్లా వైద్యాధికారి అప్పయ్య ఆదేశాల మేరకు స్థానిక వైద్యాధికారి చంద్రకాంత్ ఆధ్వర్యంలో వైద్య సిబ్బంది జారుడు బండ గొత్తికోయగూడేనికి తరలివెళ్లారు. గూడేనికి చెందిన బాలుడి సాయంతో వాగు దాటి 18 కుటుంబాలకు వైద్య పరీక్షలు చేశారు. ఇందులో 20 మంది జలుబు, దగ్గుతో బాధపడుతున్నట్లు గుర్తించి చికిత్స అందించామని సబ్ యూనిట్ ఆఫీసర్ భూపాల్‌రెడ్డి తెలిపారు. జ్వరంతో బాధపడుతున్న 8 మంది నుంచి రక్తనమూనాలను సేకరించి మలేరియా పరీక్షలు చేసి జాగ్రత్తలు పాటించాలని సూచించారు. వారి వెంట హెల్త్ అసిస్టెంట్ జంపయ్య ఉన్నారు.



తొర్రూరులో కాసం ఫ్యాషన్స్‌ను జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభిస్తున్న నటి ప్రియాంక మోహన్

## తొర్రూరులో కాసం ఫ్యాషన్స్

**సందడి చేసిన సినీనటి ప్రియాంక మోహన్**

తొర్రూరు, అక్టోబర్ 3 : మహబూబాబాద్ జిల్లా తొర్రూరులో సినీనటి ప్రియాంక మోహన్ సందడి చేసింది. కాసం ఫ్యాషన్స్ 13వ స్టోర్‌ను గురువారం ప్రారంభించింది. మాల్‌లోని లేడీస్, జెంట్స్, కిడ్స్‌వేర్ విభాగాల్లో కలియతిరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అధునాతన కలెక్షన్స్‌తో, నిత్య నూతన వెరైటీలతో కాసం ఫ్యాషన్స్ పేరు గాంచిందని, ఈ స్టోర్‌ను ప్రారంభించడం ఆనందంగా ఉందన్నారు. ఈ ప్రాంతవాసులు దసరా షాపింగ్‌ను కాసం ఫ్యాషన్స్‌లో చేయాలన్నారు. షాపింగ్ మాల్ డైరెక్టర్లు కాసం నమఃశివాయ, మల్లికార్జున్, కేదారీనాథ్, శివప్రసాద్ మాట్లాడుతూ తెలుగు రాష్ట్రాల్లో నాలుగేళ్లుగా ప్రజల మన్ననలు పొందుతున్నామని, త్వరలోనే నర్సంపేట, వనపర్తిలో కూడా విస్తరించబోతున్నామన్నారు. కార్యక్రమంలో కాసం ఫణి, సాయికృష్ణ, ధీరజ్, డాక్టర్ కాసం ప్రీతం యాంసాని ప్రవీణ్, పుల్లూరు అరుణ్‌కుమార్, తరుణ్, చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు మచ్చ సురేశ్ తదితరులు పాల్గొన్నారు.